# సరస కాంతాకాంతులు

"ఏమిటో తెల్లారి లేస్తే ఆ వంటింట్లోనే అఘోరిస్తుంది. ఒక మాటా లేదు, మంతీలేదు! అప్పుడే ఎనిమిదిన్నరవుతోంది. పొద్దున ఆరున్నరకి తాగిన కాఫీయే! మళ్ళీ కాఫీయే లేదు. రెండోసారి కాఫీ తాగితేనే కాని, స్నానం చెయ్యడు, చక్రపాణి.

"మేడమ్ కాస్త కాఫీ తగలేస్తావా!" అంటూ గట్టిగా అరిచాడు, తన భార్య సూర్యకాంతాన్ని ఉద్దేశించి.

"ఆ ఇప్పుడే స్టవ్ మీద తగలబడుతోంది కాఫీ! మీకేం మగమహారాజులు. ఏ పేపరో చదువుకుంటూ అన్నీ ఆర్డర్ ఇస్తారు. నేను, పొద్దున్న లేచినప్పట్నుంచీ, రాత్రిదాకా ఒక్కదాన్ని చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను" అంది సూర్యకాంతం.

"అబ్బా ఒక్కదాన్నీ చేయలేకపోతున్నానీపనంతా" అనే మాట రోజుకి పదిసార్లైనా అంటుంది, ఈవిడ. "ఛస్తున్నాను వినలేక!" మనిషికి ఎంతమంది భార్యలుంటారు! నేను మాత్రం అన్నిపన్లూ ఒక్కడ్నే చేసుకోవటం లేదా" అనుకున్నాడు, చక్రపాణి.

మరుసటిరోజు కూడా ఇదే తంతు! ఇక లాభం లేదు! ఈ మాట మరిపించాలంటే ఏదో ఒకటి చెయ్యాలి అనుకున్నాడు చక్రపాణి.

ఆఫీసుకి వెళ్ళాడు. తన మిత్రుడొకడు, "అతని భార్య బాత్‌రూమ్‌లో పడడం వలన, ఆవిడ కాలు కొంచెం విరిగిందనీ, మూడునెల్లపాటు ఒకావిడ్ని వంటా, మిగిలినపన్లూ చెయ్యడానికి, కుదిర్చానని" చెప్పాడు.

సాయంకాం చక్రపాణి ఇంటి కాలింగ్ బెల్ మోగింది. సూర్యకాంతం తలుపు తీసింది. ముప్పై అయిదేళ్ళావిడ, మంచి తెల్లటి చీర కట్టుకుని, ఒక వేనిటి బ్యాగ్ భుజానికి తగిలించుకొని గుమ్మంలో నిలబడింది. మంచి శరీరఛాయా! అందమైన గుండ్రని ముఖమూనూ!

"ఎవరు కావాలి మేడమ్" అంది సూర్యకాంతం.

"చక్రపాణి లేరాండీ! వాళ్ళ ఇంట్లో వంటచెయ్యడానికి రమ్మన్నారు" అంది ఆవిడ.

‘ఈరోజు ఇంట్లో ఏం ఫంక్షన్ లేదు కదా, వంట చెయ్యడానికి మనిషెందుకూ! అనుకుంటూ, ‘‘మీరేదో పొరపాటుగా వచ్చుంటారు. అడ్రస్ ఏమిటి’’ అంది, సూర్యకాంతం.

ఆమె తన బ్యాగ్‌లోంచి అడ్రస్ ఉన్న కాగితం తీసి చూపింది. ఆ అడ్రస్ తన భర్త రాసిందే! అంది.

‘‘నెలకి ఆరువందల జీతం, ఉండడానికి వసతి, భోజనం’ అని చెప్పి తన భార్య ఒక్కర్తీ ఇంట్లో పనిచేసుకోలేకపోతుందని, నన్ను కుదుర్చుకున్నారు చక్రపాణిగారు. నేనుండే ఆ చిన్న ఇల్లు సారీ! చిన్నగది చూపిస్తారా!’’ అంది ఆ వచ్చినావిడ.

‘‘ఎవరో అనుకున్నాను. నువ్వే రేప్పొదున్నారా! ఆ చక్రపాణిగారుంటారు. అప్పుడు మాట్లాడదాం’’ అని పంపేసింది ఆవిడ్ని, సూర్యకాంతం.

రాత్రి ఆఫీసునుంచి వచ్చిన చక్రపాణితో అంది సూర్యకాంతం, ‘‘ఏమిటండీ! దాన్నేవర్నో కుదుర్చుకున్నారట. పైగా చిన్నిల్లు చూపించమని అడిగింది, ఆ వన్నెలాడి’’

‘వన్నెలాడి కాదే! వన్నెలేడీ! నువ్వొక్కదానవూ పనంతా చేయలేకపోతున్నావని రోజుకి పదిసార్లైనా అంటున్నావు. నువ్వు కష్టపడడం ఇష్టంలేక, ఆవిడ్ని కుదిర్చాను, ఏం తప్పా!’’ అన్నాడు చక్రపాణి.

‘‘ మీ మొగాళ్ళెంతకైనా తగుదురు’’ అని నవ్వేసింది, సూర్యకాంతం! ఆ తర్వాత అన్ని పనులు తనొక్కర్తే సులువుగా చేసుకునేది! పాపం ఏం చేస్తుంది.

(చతుర, మే 2004)